# కరువు అను సత్యపాలుని కథ

-మేరెడ్డి యాదగిరిరెడ్డి

సత్యపాలుడు రాజపదవి కోసం తండ్రిని చంపి మామను జైల్లో పెట్టి అధికారానికి వచ్చాడు. అందమైన రాజభవనాలు అంతఃపుర భవనాలు ఎన్నో కట్టించాడు. ఎన్నో యుద్ధాలు చేశాడు తన మిత్రులకు పదవులు పంచాడు. కంటకులను ఏరిపారవేశాడు. ప్రధానులు ఉపప్రధానులు శాఖామాత్యులు ఉపశాఖామాత్యులతో ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క మంత్రి మండలిని ఏర్పాటు చేశాడు. తనబంధువులు వంది మాగధులందరికి పదవులిచ్చాడు. తనకు ఎదురు తిరుగుతారనుకున్న వారందరిని విదేశాల్లో రాయబారులుగానో, గవర్నర్లుగానో, నామినేటెడ్ పదవులిచ్చి సంతృప్తి పరచాడు. తన వారందరికీ యూనిఫారాలు కుట్టించాడు. ఏ ఆఫీసుకైనా ఆ యూనిఫారాల మీద వెళితే పనులు క్షణాల మీద కావల్సిందే. లేకుంటే ఆ ఆఫీసర్ శంకరగిరి మాన్యాలు పట్టవల్సిందే. తగిన సైన్యంతో పోలీసు బలగంతో ప్రశాంతంగా పరిపాలిస్తున్నారు రాజావారు. ఆ దేశ ప్రధాని తన దేశం గురించి విదేశాలలో ప్రచారానికి అప్పుడప్పుడు వెళ్ళి వస్తుంటారు. యిలా ఆ రాజు గారు చాలాకాలం సుఖ పరిపాలనను సాగించిన మీదట....

ఇప్పుడు మనకొచ్చిన కరువులాంటి భీకర కరువొచ్చింది. చెరువులు, దొరువులు, బావులు నదులు అన్నీ ఎండిపోయాయి. సంవత్సరాల తరబడి వర్షాలు లేవు. జనం నీళ్ళకు తిండికి మొఖం వాచి పోయారు. ఎక్కడా గడ్డి పరకలేదు. నీళ్ళ చుక్కలేదు. గడ్డిలేక ఎన్నో పశువులు చెల్లుకున్నాయి. వాటితో రాజా వారు విదేశీ మారకం సంపాదించారనుకోండి. ప్రజల్లో కోలాహలం బయలుదేరింది. దోపిడీలు దొంగతనాలు హత్యలు ఎక్కువయ్యాయి. తిండిలేని జనం దారిగాచి రాజా వారికి వెళ్ళే బియ్యాన్ని రాజకుటుంబాలకు, బంధువులకు మంత్రులకు వెళ్ళే ఆహార పదార్థాలను దోపిడీ చేయసాగారు. రాజకుటుంభంలో మంత్రి మండలిలో కోలాహలం బయలుదేరింది. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన ఆ దేశ ప్రధానికి సహచరులు ఈ వార్త చేరవేశారు. ప్రధాని వెంటనే రాజా వారిని కలిశారు.

"ప్రభూ".

"ఏంటి ప్రధానీ విశేషాలు".

దేశంలో విపరీతమైన కరువొచ్చింది ప్రభు.

"కరువా" అంటే? ఆశ్చర్యంగా ప్రశ్నించాడు రాజు.

గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో వర్షాలు లేవు. నీటి వనరులన్నీ ఎండి పోయాయి. పంటల్లేవు. పల్లెల్లో ప్రజలకు తిండి గింజల్లేవు. తాగడానికి నీళ్ళు లేవు. జనం ఆకులలములు తింటున్నారు. సరియైన తిండి లేక జనం నానారకాల జబ్బులతో అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో దోపిడీలు దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఉన్న వాళ్ల ఇళ్ళు లేని వాళ్ళు దోచుకుంటున్నారు. అన్నింటికి మించి రాజ ప్రసాదానికి వచ్చే ధాన్యాన్ని ఆహార పదార్థాలను దారి కాచి దోచుకుంటున్నారు. ఇంకా ఆలస్యం చేస్తే జనం తిరుగుబాటు చేయువచ్చు. రాజభవనాన్ని ముట్టడించవచ్చు. తిండి లేని జనం, పనుల్లేని జనం, ఆకలిగొన్న జనం ఒక్కసారిగా తిరగబడితే మనమేమీ చేయలేము మహాప్రభూ. ప్రధాని పరిస్థితిని సుదీర్ఘంగా రాజావారికి వివరించాడు.

అయితే మనమిప్పుడేం చేయాలి. రాజావారు ప్రశ్నించాడు.

రేపు మంత్రి మండలిని అత్యవసరంగా సమావేశ పరచండి అందులో చర్చిద్దాం.

"చిత్తం"

సత్యపాల రాజుగారి ఆజ్ఞమేరకు మంత్రి

మండలి అత్యవసరంగా సమావేశమయింది.

ఆయా శాఖల మంత్రులు లేచి తమ తమశాఖల పరిస్థితిని వివరించారు.

వర్షాలు కురవాలి, వర్షాలు కురిస్తే పంటలు పండుతాయి. ప్రాణాలు దక్కుతాయి. మంత్రులందరి పక్షాన ప్రధాని తీర్మానం ప్రవేశపెట్టాడు.

వర్షాలు కురవాలా! అది మన చేతిలో వుందా! అందుకు మనమేం చేయాలి? రాజుగారు సూటిగా అడిగాడు.

రాజావారు వర్షశాఖ మంత్రి వైపు చూశాడు.

ఆయన దేవాలయ శాఖ మంత్రి వైపు చూశాడు.

దేవాలయ శాఖ మంత్రిని పావం ఏ సమావేశంలో మాట్లాడనీయరు. బిక్కుబిక్కు మంటూ ఓ మూల కూర్చుంటాడు. ఇప్పుడు తనకు ఛాన్సు దొరికిందే తెగసంతోష పడి పోయాడు. లేచి నిల్చుని టోపీ సవరించుకున్నాడు. గొంతును సవరించుకుని తన ఉపన్యాసం మొదలు పెట్టాడు.

రాజా, దేశంలో పాపం రోజురోజుకి పెరిగిపోతుంది. దైవ చింతనలేదు. దేవుని గుళ్ళని పాడుబడిపోయాయి. పూజారులను, పెద్దలను ఎవరూ లెక్కచేయడం లేదు. కొన్ని పురాతన దేవాలయాలు మట్టిలో కలిసి పోయాయి. అందుకే భగవంతుడు ఆగ్రహించాడు. ఈ కరువు అందుకే వచ్చింది. మన వెంటనే పాడుబడ్డ పురాతన గుళ్ళన్నీ బాగు చేయించాలి. ప్రతి గుళ్ళో ధూపదీప నైవేద్యాలు పెట్టించాలి. భూమిలో కూరుకుపోయిన శివలింగాలు విగ్రహాలు బయటకు తీసి పునః ప్రతిష్ఠ చేయాలి. పూజాది కార్యక్రమాలు నిర్వహించాలి. శివాలయాల్లో వున్న శివలింగాల మీద అవి మునిగేంత వరకు నీళ్ళు పోయాలి. అప్పుడు గాని శివుడు కరుణించి గంగను వదలడు. వర్షాలు పడి మన కరువు తొలుగుతుంది. దేవాదాయ శాఖ మంత్రి సుదీర్ఘ ఉపన్యాసం చేసి ముఖానికి పట్టిన చెమటను పై కండువాతో తుడుచుకున్నాడు. రాజావారు సావధానంగా వింటూ కూర్చున్నారు. "శివలింగాలు మునిగేంత వరకు నీళ్ళుపోయాలా. అంత నీరే వుంటే మనకు ఈ కరువెక్కడిది" నీటి శాఖ మంత్రి లేచి ధర్మ సందేహం వెలిబుచ్చాడు.

"ప్రతి వూళ్ళో అన్ని బావుల వద్ద సైన్యాన్ని కాపలా బెడదాం. జనాలు నీరు తోడుకుపోకుండా చేసి ఉన్న ఆ కొద్ది పాటి నీళ్ళతో శివలింగాలను అభిషేకం చేద్దాం" హోం శాఖామంత్రి భరోసా ఇచ్చాడు.

ఈ సూచన రాజావారికి బలే నచ్చింది. దేవాలయ శాఖ మంత్రిని మెచ్చుకున్నాడు. ఎంతడబ్బు ఖర్చైనా వెనకడుగు వేయవద్దు. పురాతన గుళ్ళన్నీ బాగు చేయించండి. ధూప దీపనైవేద్యాలు పెట్టించండి. శత సహస్ర జల హోమాలు జరపండి. అన్ని శివలింగాలు మునిగేంతవరకు నీళ్ళ పోయించండి" రాజావారు ఆజ్ఞ జారీ చేశారు. దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. దేశ ప్రజల నుద్దేశించి రాజావారు రేడియో టీవీలల్లో సందేశాలనిచ్చాడు. జలాభిషేకం అయిపోయే వరకు ప్రజలు ఒక్క పూట నీళ్ళు తాగి పొదుపు పాటించాలని కోరాడు.

సత్యపాల రాజాజ్ఞ ప్రకారం దేశంలోని గుళ్ళన్నీ బాగు చేయబడ్డాయి. ధూప దీప నైవేద్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి గుళ్ళోను పూజారులను ఏర్పాటు చేశారు. శివలింగాలు మునిగేంతవరకు నీళ్ళు పోయసాగారు. నీళ్ళకు రేషను విధించారు. నీరు లేని గ్రామాలకు వేరే ప్రాంతాల నుండి నీళ్ళు తెప్పించి శివలింగాల మీద పోయసాగారు. దీంతో రాజావారి బొక్కసం దివాళా తీసింది. ఉద్యోగులకు జీతభత్యాలు లేవు. విదేశీ మారకం లేదు. మంత్రులకు రాజోద్యోగులకు విదేశీ పర్యటనకు డబ్బుల్లేవు. రాజ బంధువులకు ఖర్చులకు సరిపడా డబ్బులేదు. మంత్రి మండలిలో కలకలం బయలు దేరింది. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటుంది. ప్రధాని పరిస్థితిని రాజావారికి వివరించాడు.

'అప్పుడేమో ప్రజలు తిరుగుబాటు చేస్తారనుకున్నాం. ఇప్పుడేమో మంత్రులు రాజ బంధువులు తిరుగుబాటు చేసేటట్టుంది ప్రభూ" ప్రధానమంత్రి పరిస్థితిని కూలంకషంగా వివరించాడు.




రాజావారి గుండెల్లో గుబులు బయలు దేరింది. ప్రజలనైతే సైన్యం సహాయంతో అణచవచ్చు. మరి తన మంత్రి మండలి రాజబంధువులు తిరుగుబాటు చేస్తే తన పని ఖాళీ. రాజుగారు తలపట్టుకున్నాడు. "మన బొక్కసంలోని డబ్బంతా ఎటు పోయినట్టు. రాజావారి ప్రశ్న.

అయ్యా మన డబ్బంతా ఎక్కడికి వెళ్ళలేదు. ఏ దేశాలకూ పోలేదు. మన దగ్గరే వుంది. మన ప్రజల దగ్గరే వుంది. ముఖ్యంగా మొన్న మీ ఆజ్ఞ ప్రకారం పాత గుళ్ళన్నీ బాగుచేయించాం. నీళ్ళు పోయించాం. గుళ్ళు గోపురాలు బాగు చేసిన మేస్త్రీలకు, కూలీలకు, నీళ్ళు మోసిన కూలీలకు ఖర్చయింది ప్రభూ. "అయితే ప్రజల మీద ఇప్పుడున్న పన్నులను రెట్టింపు చేయండి. పాత బకాయిలను మొత్తం వసూలు చేయండి. ఎలాగయినా బొక్కసాన్ని నింపండి" రాజా వారి ఆజ్ఞ.

రాజుగారి ఆజ్ఞ మేరకు అధికారులు సైన్యం గ్రామాల మీద పడ్డారు. బలవంతంగా పన్నులు వసూలు చేశారు. ఇవ్వలేని వారి భూములను పశువులను ఇంట్లో వస్తువులను వేలం వేసి బొక్కసంలో జమ చేశారు. బొక్కసం నిండి పోయింది. రాజా వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈలోగా దేశంలో తేలికపాటి వర్షం పడింది.

"ప్రధానీ! ఇక దేశంలో ప్రజల కష్టాలు తీరినట్టేనా" రాజావారి ప్రశ్న.

"లేదు ప్రభూ. ప్రజలు పనులు లేక నానా కష్టాలు పడుతున్నారు. దేశం విడిచి వలసలు పోతున్నారు. కూలికి పోదామంటే గ్రామాల్లో పనుల్లేవు. అర్ధాకలితో ఉప్పిడి ఉపవాసాలుంటున్నారు."

"మరి ఇప్పుడేం చేద్దాం?"

కరువు పనులు చేపడితే జనానికి పని దొరుకుతుంది ప్రభూ ప్రధాని చెప్పాడు.

అయితే వెంటనే కరువు నివారణ కింద 100 కోట్ల రూపాయలు విడుదల చేయండి. గ్రామ గ్రామాన రోడ్లు వేయించండి. చెరువులు కాలువలు బాగు చేయించండి. విశ్రాంతి మందిరాలు అతిథి

గృహాలు నిర్మించండి. ప్రజలకు పనులు దొరికేలా చేయండి. కరువు పనులు చకచకా జరిగిపోవాలి. ఒక నెల రోజులలో ఈ పనులన్నీ జరిగి కరువు రోజుల్లో జనం సుఖంగా బ్రతకాలి. రాజు మంత్రి మండలిని పురమాయించాడు. 100 కోట్ల రూపాయలు బొక్కసం నుండి విడుదల చేశాడు.

మంత్రి మండలిలోని వారికి రాజబంధువులకు పెద్దవారికి చిన్నవారికి చిన్న కాంట్రాక్టులు దొరికాయి. దేశంలో ఎక్కడ చూసినా కరువు పనులే. రోడ్లు వేయడం చెరువులు త్రవ్వడం చకాచకా జరిగిపోతున్నాయి. ఓ నెల రోజుల్లో యిచ్చిన పనులన్నీ పూర్తయి పోయాయి. 100 కోట్ల రూపాయలు ఖర్చయి పోయాయి.

కాంట్రాక్టర్లందరు ఇంత మంచి కరువు పథకం అమలు పరచినందుకు రాజా వారికి, భారీ అభినందన సభను ఏర్పాటు చేశారు. దారిపొడువునా రాజుగారి మీద పూల వర్షం కురిపించారు. రాజప్రసాదం విడిచి బయటకురాని రాజావారిని చూడాలని దారి పొడవునా ప్రజలు బారులు తీరి నిల్చున్నారు. టాపులేని కారులో ప్రజలకు నమస్కారం చేస్తూ చిరునవ్వులు చిందిస్తూ సభా వేదిక చేరారు. చప్పట్లు మారుమ్రోగాయి. బాజాభజంత్రీలు మ్రోగాయి. బ్రాహ్మణులు వేదమంత్రాలతో రాజావారికి ఆశీర్వచనం పలికారు. సభ నిండుగా వుంది. వేదిక మీద మంత్రి మండలి, కాంట్రాక్టర్ల సంఘం పెద్దలు ఆశీనులయ్యారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ప్రధాని ఆ రోజు సభా కార్యక్రమం వివరించాడు. కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు లేచి ముందు రాజా వారికి, తదుపరి ప్రజలకు నమస్కరించాడు.

పూజ్యులైన రాజావారు, మంత్రి మండలి సభ్యులారా

ఓ నా దేశ ప్రజలారా! రాజా వారు మన దేశానికి చేస్తున్న సేవ మరువరానిది. ఈ కరువు రోజుల్లో ఎన్నో పనులు చేపట్టి ప్రజలకు పనులు కల్పించారు. ఒక్క నెలలో 100 కోట్ల రూపాయల పనులు చేయించిన ఘనత వారిది. అన్ని గ్రామాలల్లో కరువు పనులు చేయబడ్డాయి. కూలీలకు పనులు దొరికాయి. ఇక ముందు కూడా ఇలాంటి పనులు చేయిస్తారని ఆశిస్తాను. వారు మన దేశానికి మన ప్రజలకు చేసిన సేవలకు కానుకగా ఈ చిన్ని స్వర్ణ కిరీటం.... మా సంఘం తరఫున రాజావారికి సమర్పిస్తున్నాం" రత్నాలు పొదిగిన బంగారు కిరీటం రాజావారి తలపై వుంచాడు కంట్రాక్టర్ల సంఘాధ్యక్షుడు. జనం చప్పట్లు కొట్టారు. మేళతాళాలు మోగాయి. సత్యసాల రాజుకి జై నినాదాలు మిన్నుముట్టాయి.

సంతోషంతో రాజావారు ఓ నెల రోజులలో 100 కోట్ల కరువు పనులను చేసిన కాంట్రాక్టర్లను అభినందించాడు. ఇంకో 100 కోట్ల పనులు మంజూరు చేశాడు.

అర్ధాకలితో వస్తున్నటున్న జనం కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరారు. ఇదీ సత్యపాలుని కరువు కథ.

## అదిగో...
## కొత్త సంవత్సరం

**బ**తుకు పొట్ట
చేత బట్టుకుని
కరువు వలస ప్రవాహంలో
కొట్టుకెళ్ళే మనిషీ...
ఎంతటి కన్నీటి వరదొచ్చినా
ఈ ప్రపంచం నుండి ఎవరూ
పలాయనం చెయ్యలేరుగా?
తిరుగుతున్న మలుపులో
ఆశగొలిపే మైలురాయిలా
అదిగో మళ్ళీ
క్రొత్త సంవత్సరం...
ఆనంద గమ్యం చేరుస్తుందనే
ఆకాంక్షిద్దాం...!!

**-పెరుగు రామకృష్ణ**